# పెద్దపులి చెప్పిన కథ

అవును, నేను పెద్దపులినే, పెద్దపులి కూడా కథ చెప్పడమేనా అనొచ్చు మీరు. అంత తొందరగా అలా అనకండి.మానవుడి స్వభావంలో నేను కళ్ళారా చూసిన విపరీతాలు ,ఘోరమైన దారుణాలు నాపులి గుండెను సైతం కదిలించివేశాయి. మానవుడు నాకు మొదటి సారిగా వేటగాడిగానే పరిచయం అయ్యాడు. మానవుడి చేతిలో పట్టుబడి పోవటం, బోనులో ఇరుకున పడటం - నాజీవితంలో నేను మరచిపోలేని దుస్సంఘటన. క్రూరమృగాలు, విషజంతువులూ అంటుంటారే వాటన్నిటికంటే మానవుడు మహాక్రూరుడు విషపుకుట్టి అని చెప్పడానికి, అంతకంటే ఎక్కువ దుష్టుడూ, నీచుడూ అల్పుడూ అని చెప్పడానికి ఆ సంఘటన చాలును. మేకపోతును ఎరచూపించి నన్ను మోసం చేసి బోనులో ఇరికించడానికి నరులు అవలంబించిన పద్ధతులు చూసి మొట్టమెదటసారి నరుడంటే నాకు యమభయమూ, పరమ అసహ్యమూ వేశాయి. అప్పటికీ యిప్పటికీ అవి పెరిగాయి గాని తరగలేదు.

మహారణ్యంలో స్వేచ్ఛగా తిరిగిన నాకు బోనులో గడపడం మహాదుర్భరంగా తోచింది. ఆబాధ అనుభవించిన వాళ్ళకి తప్పఅర్థంకాదు, నన్నుపట్టి బోనులో పెట్టిన వాళ్లమీద నాకు అపరిమితమైన కోపం వచ్చింది.

పట్టుబడిన కొద్దికాలానికి నేనొక స్మగ్లర్ చేతిలోనికి మారాను, అతనిపేరు రాబర్టో రాబందో ఏదోవుంది విదేశీ పేరు. మనిషి మాత్రం విదేశం స్వదేశం కలసినట్టుండేవాడు. చాలా ఎర్రగా చాలా పొడవుగా చాలా బలిష్టంగా చాలా అందంగా వుండేవాడు. అతని కళ్ళు పులి కళ్ళు, నన్నుచూసి తెగమెచ్చుకునేవాడు. పులుల్లో నేను మోస్ట్ ఆపుల్లీ బ్యూటిఫుల్‌గానూ, రాయల్ గానూ ఉంటానట. నేనంటే చాలా చాలా అధికమైన ప్రేమప్రదర్శించేవాడు. నన్ను చాలా యిష్టంగా హుక్కా పీలుస్తూ గంటలతరబడి చూస్తూ ఉండిపోయేవాడు. అతగాడికి ఒకసారిచాలా ప్రమాదం వచ్చి పడిపోయింది. హత్యానేరమూ, స్మగ్లింగ్ నేరమూ రెండూ ఒక్కసారి వచ్చిపడ్డాయి, అతనెన్నో హత్యలు చేశాడట. చేయించాడట. స్మగ్లింగ్ వ్యాపారం కూడా చాలా సంవత్సరాలనుంచీ చేస్తున్నాట్టకానీ ఇంతప్రమాదంగా ఎప్పుడూ పట్టుబడి పోతాడనుకోలేదట. అది తప్పించుకోడానికి బోలెడు డబ్బుఖర్చు పెట్టడమే కాకుండా ఒకపెద్ద ఆపీసర్‌కు నన్ను బహుమానాంగా ఇచ్చేశాడు . అలా ఇచ్చిన రోజున రాబర్టుపడిన బాధ అంతాంతా అని చెప్ప శక్యంకాదు.

అలాగ నేను ధర్మశాస్త్రిగారి దగ్గరకు వచ్చాను. ఆయన అదేదో డిపార్ట్‌మెంట్‌లో అత్యధికమైన అధికారంగల పెద్ద ఆపీసర్. ఆయన చాలా సేపు పూజచేసి నుదుట విభూది రాసుకొని కనుబొమలమధ్య గంధంతోనూ, కుంకుమతోనూ బొట్టుపెట్టుకునేవాడు. అలాంటి వేషంలో ఆయన్ని మొదటిసారి చూసినపుడు ఆవు నుదుట బొట్టుపెడితే ఎలా వుంటుందో అలా వున్నాడు. ఆయన చూపులు చల్లగా చాలా చల్లగానూ, ఆవు చూపుల్లా చాలా అమాయకంగానూ వున్నాయి. ఆయన చిన్నప్పుడు వారాలు చేసుకొని చదువుకున్నాడట. స్వయం ప్రతిభతో పైకి వచ్చి బ్రిటీష్ వాళ్ళుమనదేశం వొదిలి వెళ్లిపోయే సమయానికి ఒక ఆఫీసరయ్యాడట. మరి స్వతంత్ర్యంవచ్చాక మరింత పెద్ద ఆఫీసరయిపోయాడు. అనేక బాధ్యతాయుతమైన పదవుల్లో అతి సమర్థవంతంగా పనిచేసి అనేకానేక దేశాలు పర్యటించి అనుభవం గడించి ప్రభుత్వానికి అత్యంతవిశ్వాస పాత్రుడేకాక, అధిక ప్రీతిపాత్రుడు కూడా ఘనంగా రిటారయ్యాడు.

రిటయిరయిన తరువాత ఆయన అదేదో మహానగరానికి సమీపంలో సముద్రపు వొడ్డున స్వంతంగా కట్టించు కున్న అందాల మేడ వున్న విశాలమైన కాంపౌండులోనే మరో వందగజాల దూరంలో మరో చిన్న మేడలాంటిది వున్నది. అదిపైకి కొంచెం పాడయినట్టు కనపడినా లోపల చాలా బావుంటుంది. అందులో ఒక మూల ఒక పెద్ద గదిలో బోనులో నన్ను ఉంచారు.

నాకు తెలిసినంతలో ఆయనకు భార్యా పిల్లలూ లేరు. ఆయన విదేశాల్లో ఉంటూ ఒకానొక దొరసానిగారితో ఉంటూండగా ఆవిడకొక కొడుకు పుట్టాడట. ఆవిడవల్ల ఆయనకు లక్షల ఆస్తి కలిసి వచ్చిందట. ఆవిడగాని ఆవిడకు పుట్టిన కొడుకుగాని యిప్పుడెక్కడున్నారో మనకు తెలియదు.

ధర్మశాస్త్రిగారికి కరియప్ప అని ఒక పర్సనల్ సెక్రట్రీ వున్నాడు. అతడు స్వయంగా దగ్గరుండి నాకు మాంసం పెట్టిస్తూ, నా యోగ క్షేమాలు చూస్తూ వుంటాడు. ధర్మశాస్త్రిగారు గోవులా వుంటే కరియప్ప నక్కలాగో గుంట నక్కలాగో వుంటాడు. అట్టే నల్లగా వుండడుగాని ఎర్రగా మాత్రం వుండడు. మనిషి చాలా సన్నగా, అయిదడుగుల పొడవుగా, సున్నితంగా గుండుసూది గుచ్చినా చచ్చిపోతాడేమోనన్నంత అర్భకంగా వుంటాడు ఒక విదేశీ మిషనరీకి స్వదేశ సిస్టర్‌కే పుట్టి–ఢిల్లీలో పెరిగి పెద్దవాడై ఒకానొక మిలటరీ ఆఫీసర్ ఇంట్లో పని చేస్తూవుండగా, ధర్మశాస్త్రి గారు అతన్ని తనక్కావాల్సిన మనిషిగా పసికట్టి తన దగ్గరికి మార్పించుకుని, చివరికి తన దగ్గిరే వుంచేసుకుని– బాగా చదువుకున్న వాడయిన కారణం చేత అతన్ని మోస్టు కాన్ఫిడెన్షియల్ పర్సనల్ సెక్రట్రీగా ఏర్పాటు చేసుకున్నారు. ధర్మ శాస్త్రిగారి తాలూకు సర్వవిధాలయిన పనులూ కరియప్ప ద్వారానే జరుగుతూ వుంటాయి.

ఆయనకి భార్యా పిల్లల్లేరని చెప్పాను కదూ. కాని ఆయన దగ్గిర ఎంతో అందమైన మనోహరమైన పాతిక ముప్పయేళ్ళ ఫ్రెంచి లేడీ వుండేది. ఆవిణ్ణి కూడా ఆ స్మగ్లర్ రాబర్టే ఏర్పాటుచేశాడని కరియప్ప చెప్పాడు. ఆవిడ నవ్వితే మల్లెపూలు విచ్చుకున్నట్టు వుంటుంది. ఆవిడ తన నీలి నీలి కళ్ళతో మెల్లగా చూస్తే చందమామ చల్లగా చూసినట్టు వుంటుంది. లౌలీగానూ, డివైన్లీగానూ వుంటుందావిడ. ఏనాటమీ తెలిసిన చిత్రకారులు ఆవిడ శరీరంలో వంపులు చూసి పిచ్చెత్తిచావ్వాలసిందే. అంతలా వుంటుంది. ఆవిణ్ణి నేను బహుకొద్దిసార్లు మాత్రమే చూశాను. మానవ జాతి మీద నాకున్న అసహ్యం ఇంతా అంతా కాదు. కాని ఆవిణ్ణి చూసినప్పుడు మాత్రం– నాకు మానవరూపం వచ్చి ఆవిడతో ఒక్క గంట గడప గలిగినా ఎంతో ఎంతో భాగ్యం అనిపించింది. నేను విన్నంతలో ఆవిడ ఎక్కువగా ఫ్రెంచీ, కొద్దిగా ఇంగ్లీషూ మాట్లాడుతుంది. కంఠస్వరం సన్నగా తమాషా అయిన సంగీతంలా వుంటుంది.

రిటయిరయి మకాం సముద్రతీరంలోని ఒక మహా నగరానికి మార్చేశాక, ధర్మ శాస్త్రిగారు ఒక పెద్ద పారిశ్రామిక సంస్థకు ఛైర్మెన్ ఆఫ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అయ్యాడు. ఆ మహానగరంలో పాలరాతి తోనూ, నల్లరాతి శిల్పాలతోనూ నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి ట్రస్టీగానో, మరిదేనిగానో గాని నియమితుడయ్యాడు.

ఆయన ఆధ్వర్యంలో పారిశ్రామిక సంస్థ కొన్ని కోట్లూ, పాలరాతి ఆలయం కొన్ని లక్షలూ లాభాలు గడించాయి. ఇంతలో పారిశ్రామిక సంస్థలో చిన్న చినుకులాగా, చిరుగాలిలాగా ప్రారంభమైన కార్మికుల సమ్మె చూస్తూ చూస్తూ ఉండగానే మహా ప్రభంజనంలా మారిపోయి యాజమాన్యాన్ని ఉగ్రూతలూపటం ప్రారంభించింది. చిన్న తలనెప్పి లేదా కాస్త జలుబుతో ప్రారంభమైన అనారోగ్యం చాలా తొందరలోనే ఉపద్రవమైన మహా రోగంగా మారిపోయి ప్రాణాలమీదకి వచ్చినట్టు, బీడీ ముక్క పారేస్తే అంటుకున్న కమ్మలిల్లు ముందుగా మరో రెండు కమ్మలిళ్లని తగలబెట్టి ఆ తరవాత పెద్ద పెద్ద బిల్డింగుల్ని తగలబెట్టేసి పట్నం అంతా చుట్ట చుట్టేసినట్టు– అతి చిన్న కార్మికుల సమ్మె కాలాంతకమై యజమానుల పీకల మీదకు వచ్చి వాళ్లని కలత పెట్టేసింది.

ధర్మశాస్త్రిగారు యాజమాన్యంతో కలిసి ఆ ప్రమాదాన్ని 'డీల్' చెయ్యడానికి పూనుకున్నారు. నేనుంటున్న పాత మేడలోనే రహస్య సమావేశాలు జరిపారు. ఇటువంటి రహస్య మంత్రాంగం తరవాత ధర్మశాస్త్రి గారి ఆధ్వర్యంతో సమస్యని శాంతియుతంగా పరిష్కారం చెయ్యడానికి కృషి జరిగిందట. యాజమాన్యం ఒక మెట్టు దిగి కార్మిక నాయకులతో– ధర్మశాస్త్రిగారి భాషలో కూలి వెధవల్తో– చర్చలు జరిపిందట. దాంతో కార్మికనాయకులు మరింత రెచ్చిపోయి యాజమాన్యం అవలంబిస్తున్న 'పచ్చికేపటలిస్టు ధోరణి' నీ 'దోపిడీ విధానాన్నీ', 'దమన నీతినీ' ఆ సంస్థ ప్రొప్రయిటర్ ఎస్.కె. చౌదరిగారు, ధర్మశాస్త్రిగార్ని మొహంమీదనే తీవ్రంగా వ్యతిరేకించి నానా కారుకూతలూ కూశారట. సమ్మె సందర్భంగా అరెస్టయిన వాళ్ళని వెంటనే విడుదల చేయించమన్నారట.

మరెవరయినా అయితే కోపంతో రెచ్చిపోయేవారే. పరిస్థితిని ధర్మశాస్త్రిగారు చిరునవ్వుతో భరించారు. ఆ రాత్రి నేనుంటుండే పాత మేడలో– దాన్ని తరచుగా పెద్దపులి మేడ అంటున్నారిప్పుడందరూను– దీర్ఘకాలికమైన మంతనాలు జరిపారు. ఆ రోజు కూడా ధర్మశాస్త్రిగారు పూజచేసి మొహాన్న కుంకం బొట్టు పెట్టుకున్నారు. నా దగ్గిరికి వచ్చి కాసేపు నిలబడ్డారు. అప్పుడాయన్ని చూశాను. బొట్టు పెట్టుకున్న గంగిగోవులా వుంటుందని చెప్పానుకదూ ఆయన మొహం? కాని ఆ రోజు పెద్దపులి మొహంలా కనపడింది. అంటే మాజాతి మొహంలా కనపడింది. ఇక్కడ మీరు కోపం తెచ్చుకున్నాసరే కొన్ని సంగతులు చెప్పక తప్పదు.

పెద్దపులిలోవున్న క్రూరత్వం వేరు. మనిషిలో వున్న క్రూరత్వం వేరు. అసలు నా ఉద్దేశంలో చెప్పాలంటే పెద్దపులిలో క్రూరత్వంలేనేలేదు. మా జాతి గురించి నేను చాలా పక్షపాత బుద్ధితో మాట్లాడుతున్నానని ఒప్పుకుంటాను. ఆహారం కోసం వేటాడే సమయంలోనూ, ఆత్మరక్షణలోనూ తప్పిస్తే మీకనిపించే ఆపాటి క్రూరత్వమూ పెద్దపులి కళ్ళల్లో కనపడదు. పెద్దపులిలో కనిపించినంత "శాంతి". ఆ మాటకొస్తే సింహంలోగాని మరే జంతువులోనిగాని కనిపించినంత శాంతి నాకు తెలిసినంతలో మానవ జాతిలో కనపడలేదు. అందర్నీ తన గుప్పిట్లో పెట్టుకోవాలనీ, కష్టించే వాళ్ళ కడుపులుకొట్టి కోట్లు కూడబెట్టాలనే లాంటి తత్త్వం– పెద్దపులికే కాదు మరే జంతువుకీ వుండదు. దోపిడీ తత్త్వం నాకే జంతువులోనూ కనపడలేదా. ఆహారం కోసం ఒక జంతువు మరో జంతువును చంపడం దోపిడీ అంటే నేనొప్పుకోను.

మనిషి– మనిషిలాకంటె మరోలా, పులిలాగ నక్కలాగ పాములాగ రాబందులాగ ప్రవర్తించడం నేను చూశాను.

ఆ రోజు ధర్మశాస్త్రిగారి కళ్ళు నిప్పులు కురవడం నేను చూశాను. ఆయన నుదుటి మీద నరాలు ఉబ్బడం గుర్తించాను. ఆయన కణతలు కొట్టుకోవడం గమనించాను. ఆయన కళ్ళలోంచి పొగలు రావడం పసిగట్టాను. ఆయన మెదడులో ఉడుకుతున్న క్రూరాలోచనలు నేను వాసన చూడగలిగాను. తనకు లొంగని జంతువుని పట్టుదలగా చంపే సమయంలో కూడా పెద్దపులి ముఖంలో కనపడనంత క్రౌర్యం ఆయన మొహంలో స్పష్టాతిస్పష్టంగా కనపడింది, నాకా వేళలో–

ఆ మర్నాటి రాత్రి–

పెద్దపులి మేడ అంతకు ముందెన్నడూ లేనంత కోలాహలంగా వుంది. విదేశీ బ్రాందీతో ధర్మశాస్త్రిగారూ, ప్రొప్రయిటరు ఎస్.కె. చౌదరిగారు మరో యిద్దరు 'ప్రధాన' వ్యక్తులూ పార్టీ చేసుకుంటున్నారు, కరియప్ప దగ్గిరుండి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాడు. తెలుగురాని అందమయిన అమ్మాయిలు విదేశీ గ్లాసుల్లో విదేశీ మద్యాన్ని వంపుతున్నారు. చికెన్ బిర్యానీ ప్లేట్లు సరఫరా చేస్తున్నారు.

ధర్మశాస్త్రిగారి పక్కన లిల్లీ అనే ఫ్రెంచీ లేడీకూడా వుంది. పెద్దపులినయిన నన్ను మెయిన్ టెయిన్ చేస్తున్నందుకు ఆయన కెంత గర్వంగానూ అహంకారంతో కూడిన ఆనందంగానూ వుంటుందో, లిల్లీ అనే ఫ్రెంచ్ లేడీని "కలిగి వున్నందుకు" కూడా ఆయనకంత గర్వంగానూ, అతిశయంతో కూడిన ఆనందంగానూ వుంటుంది. అప్పుడప్పుడు "ఘనత వహించిన" తన మిత్రులకు నన్నెలా చూపిస్తూ వుంటారో ఆ వెన్నెల వెలుగులాంటి లేడీని కూడా అలాగే చూపిస్తూ వుంటారు. ఇందులో "హైక్లాస్" అహంకారం తప్ప సౌందర్య దృష్టి నాకు ఆవగింజంత కూడా కనపడలేదు.

అలా పార్టీ జరుగుతూండగా–

నా ఎదురుగా మరో బోనులో - అంటే జైలు గదిలోఇద్దరు మనుషులు చేతులకూ కాళ్ళకూ కట్లతో స్పృహ తప్పి పడివున్నారు. వాళ్ళ శరీరాలు తూట్లుతేరి వున్నాయి. రక్తపు మరకల్తో వున్నాయి. అందులో ఒకడికి నలభయ్యయిదేళ్ళు ఉండొచ్చు. మనిషి కాయదేరి వున్నాడు. కాయకష్టం చేసే వాడిలా బద్దలా బలంగా వున్నాడు. మరొకడు తోటకూర కాడలా వున్నాడు. అతనికొక ఇరవయి మూడు, ఇరవయి నాలుగేళ్ళుండొచ్చు. ధర్మశాస్త్రి గారిచ్చిన 'ప్లాన్' మేరకు కరియప్పే వాళ్ళనలా తెప్పించి ఆ జైలు గదిలో వేయించాడు.

అవతలి హాల్లో పెద్దగా కబుర్లు చెప్పుకుంటూ పార్టీ చేసుకుంటున్నారు పెద్దలు. జైలుగదిలో వున్న వాళ్ళిద్దరూ ఈ అలజడి కంతటికీ ప్రధానకారకులట. వాళ్ళని ముందు ముందు తానేమేమి చెయ్యబోతున్నదీ కూడా ఆయన వివరించారు.

"అంతకూ వాళ్ళు దోవకు రాకపోతే వెధవల్నిద్దర్నీ పులికి వేసేస్తే మాత్తరం రుజువా, సాక్షీవా ?' అంటూ పెద్ద నవ్వొకటి నవ్వేరాయన, పెద్దపులి మేడ దద్దరిల్లిపోయేలాగ.

ఆ మర్నాడు–

జైల్లో వున్న వాళ్ళిద్దరికీ మెలకువొచ్చింది. కొంచెం సేపు మూలిగారు. అ తరువాత దాహంతో అంగలార్చారు. నీరసంగా ఏవేవో మాట్టాడుకున్నారు. నాకు వాళ్ళ మాటలు కొంచెంకూడా బోధపడలేదు. కాని వాళ్ళలో పెద్దవాడి పేరు రుద్రయ్యనీ, రెండోవాడి పేరు క్రిష్ణ మూర్తనీ తెలిసింది. అలా యిద్దరూ ఆ రోజంతా వుండిపోయారు. ముగ్గు వేస్తే ఏలికపాము కొట్టుకున్నట్టు– దాహంతో ఆకలితో, గాయాల బాధతో అన్నిటినీ మించిన మానసికక్షోభతో వాళ్ళలా గిల గిలా కొట్టుకుంటున్నారు. ఆ సాయంత్రం ధర్మశాస్త్రిగారూ, కరియప్పా మరో యిద్దరు మనుషుల్ని వెంటబెటుకొచ్చి వాళ్ళకట్లు విప్పించారు. చెరో గిన్నెతో అన్నమూ. ఒక సీవెండి తపేలాతో నీళ్ళూ. ఒక సీవెండిగ్లాసూ ఇచ్చారు చెరో రేకు డబ్బా కూడా యిచ్చారు. ఒక వేలొకసారీ, రెండు వేళ్ళొక సారీ చూపించి "మీకిక అన్నీ వాటిలోనే. అండర్ స్టాండ్?" అన్నాడు కరియప్ప. అని నక్క నవ్వు నవ్వాడు. నేను నా బోనులో అటూ యిటూ తిరుగుతూ అన్నీ కనిపెడుతూనే వున్నాను. ధర్మశాస్త్రీ, కరియప్పా మరో యిద్దరు వలష్కరులూ అలా వాళ్ళమీద తమ జులుంచూపిస్తుండగా, వాళ్ళిద్దరూ పాపం ఆవురావురుమంటూ అన్నాలు తిని, నీళ్ళు తాగారు. అంత హీనంగా చూడటానికి కారణం, వాళ్ళు "కష్టపడినా కడుపునిండని కార్మికుల పక్షాన నిలబడటం" అని క్రమంగా అర్థం చేసుకున్నాను. "మాక్కావలసిన కొన్ని ముఖ్యమైన వివరాలు మాకు చెప్పండి. మీ వాళ్ళందర్నీ సమ్మె విరమించుకోమని చెప్పండి. ఇప్పటికే సమ్మెవల్ల కంపెనీకి కొన్ని లక్షల లాసొచ్చింది. సమ్మె విరమించేస్తే మీకు చెరో లక్షా పారేస్తాం"..... అని శాస్త్రి గారంటుంటే కరియప్ప అడ్డుపడి ఆయన్ని వారించాడు. "కమాన్. వచ్చేయండిసార్. ఆ బద్మాషుల్ని బతి మాల్తారేమ్సార్. నేన్జెప్తాను కదా– రండి" అంటూ లాక్కుపోయాడు.

రుద్రయ్యా క్రిష్ణమూర్తీ ఆ రాత్రి నిద్రపోలేదు– వాళ్ల కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి. వాళ్ళ మాటల్నిబట్టి వాళ్ళ గుండెలు కొలుముల్లా వుండి వుండాలి... క్రిష్ణమూర్తి మాటలో కొద్ది పాటి అధైర్యం కనపడింది. రుద్రయ్య రుద్రుడై పోయాడు– నిప్పులు కురిపించాడు.

"మా నాన్న తెలంగాణా ఉజ్జమంలో ఎలా చచ్చిపోయాడో చాలాసార్లు చెప్పాన్నీకు. చెప్పరాని హింసలు పెట్టి కడకి కపాలం మీద మేకు కొట్టి చంపేశారు. ఆడవాళ్ళకి లూజు పంట్లాంలు తొడిగి నడుందగ్గిరా కాళ్ళ దగ్గిరా తాళ్ళతో ఆ పంట్లాం కట్టేసి లోపల తొండల్ని, మండ్రగబ్బల్ని వొదిలేవారు. అవి తొడలూ మానమూ చీరేస్తాయి. ఆ నెత్తురు మడుగు మీద కారం జల్లేవారు. చింతబరికెల్తో సొమ్మసిల్లేదాకా బాదేసేవారు, అలాంటి కిరాతకాలకి గురయి మా అమ్మ చచ్చిపోయింది. ఇంతకీ మా అమ్మా నాన్నేకానీ, మరెందరో వేలాది మందేగానీ ఎందుకంత ఘోరమయిన చావు చావ్వలిసి వచ్చింది? ఏ విధమయిన ఫాసిస్టుపాలనా మాకొద్దు– మా తెలంగాణా రైతాంగానికి విముక్తి కావాలని అడిగినందుకు. మా అమ్మా నాన్నా చచ్చిపోయే సమయానికి పన్నెండో పదమూడో వుంటాయి నాకు. పేదోళ్ళని కొట్టే పెద్దోళ్ళజులుం పటేలు అమీనుగాళ్ళ కిరాతకం నేను ఎన్నడూ మర్చిపోలేను. కలిగినోళ్ళు ఆళ్ళు కోసుకుతినే మేకని చూసినట్టు కూడా మనల్ని చూడరన్న ముక్క నాకు మరి మర్చిపోలేనంత బాగా బాగా బోధపడిపోయింది. అంచేత నాయాళ్ళు ఇంకొకిన్ని ఆశలు చూపెట్టినా లొంగడంవల్ల ఇంకాకొన్ని చంపేసిన చచ్చిపోడానికి సిద్దంగా వున్నాను కాని మనవాళ్ళ గుట్లు చెప్పేసి, సొమ్ము కోసం వీళ్ళతో కుమ్మక్కయి పోయి వాళ్ళ గొంతుక్కోయ్యను. నువ్వు పిరికి పడి నోరు ఇప్పావో, లొంగిపోయావో నిన్ను జంపేసి నేను జచ్చి పోతాను..." అని రుద్రయ్య ఇంకా చాలా చాలా చెప్పిన మీదట, క్రిష్ణమూర్తి అవునంటూ వీళ్ళకి లొంగడం కల్ల అన్నాడు చాలా ఉద్వేగంతో. తమవారి క్షేమం కోసం సంక్షేమం కోసం ఆత్మత్యాగం చెయడానికే వాళ్ళిద్దరూ నిర్ణయించుకున్నారు.

ఆ తరవాత రోజుల్లో రుద్రయ్యా, క్రిష్ణమూర్తి అనుభవించిన చిత్రహింసలు వర్ణించడం నావల్ల కాదు. అయితే ధర్మశాస్త్రికి లొబడి నట్టు వాళ్ళు మాట్లాడలేదు. చాలా పౌరుషంగా మాట్లాడారు. దాంతో కోపంవచ్చి మనిషిని వింటి బద్దలా వెనక్కివంచి ముఖం నేలవేపు ఉండేలా కాళ్ళకీ చేతులకీ తాళ్ళు కట్టి పైకి వేలాడదీశారు. అలా వుండగా పెద్ద పెద్ద బండరాళ్ళని వీపు మీద వేసి తాళ్ళతో బిగించి కట్టారు. రుద్రయ్య మీసాలు రెండూ పట్టుకుని సాగదీసి, నోరు తెరిచేలా చేసి నోట్లో కేంద్రకింత వుమ్మారు డబ్బాల్లో వాళ్ళు విడిచిన మూత్రాలే తెచ్చి వాళ్ళ నోళ్ళలో పోశారు. మంచినీళ్ళు కాని, తిండికాని వాళ్ళ ప్రాణాలు పోకుండా వుండటానికి మాత్రామే యిచ్చేశారు. క్రిష్ణమూర్తి తోటకూరకాడలా వున్న కారణం చేత తట్టుకోలేకపోయేవాడు, చాలా దారుణంగా గుండెలు తెగిపోయేలా అరుస్తూ వుండేవారు. ఒక మనిషి అంత హృదయవిదారకంగా అరవడం– అందునా మరో మనిషే, అతన్నలా చెయ్యడం నా జీవితంలో నేన్నుడలేదు. రుద్రయ్య బాగా ధైర్యంగానేకాక చాలా కక్షగా కూడా మాట్లాడేవాడు. కరియప్ప మరీ రెచ్చిపోయి ఇంకా హింసలు పెట్టేవాడు. కాళ్లూ చేతులూ కట్టేసి గాల్లో వేళ్ళాడదీసి అక్కడక్కడ బ్లేళ్ళతోకోసి కారం జల్లి నప్పుడోసారీ, బోర్లాపడుకోబెట్టి వొంట్లొ ఎముకలన్నీ విరిగి పోయేలాగ మెడనించి కాళ్ళ వరకూ నలుగురు మనుషులు ఒక పెద్ద ఇనప రోలర్‌తో గట్టిగా అరుస్తూ తిప్పినప్పుడింకోసారీ క్రిష్ణమూర్తి హృదయ విదారంగా అరిచాడు. గిల గిల గిల కొట్టుకున్నాడు. చచ్చిపోయాడనే అనుకున్నాను.

వాళ్ళెంతకూ లొంగలేదు. ధర్మశాస్త్రి గారి కక్ష విపరీతంగా పెరిగిపోతోంది. కరియప్పని పిలిచి రహస్యంగా చెప్పారు–

"వెధవల్నిద్దర్నీ సరుగుడు తోటల్లోకి తీసుకుపోయి సఫాచేసేయండి. పోలికతెలీకుండా మొహాలు

2S164



చితక్కొట్టండి. రెండు శవాలకూ రాళ్ళు కట్టేసి స్టీమర్‌లో పడేసి సముద్రంలోకి తీసుకుపోయి అక్కడ నీళ్ళల్లోకి తోసేండి. దాంతో చెల్లు "అందుకు కేడీ చౌదరిగారు చాలా సంతోషించి ధర్మశాస్త్రిగారి స్కీమ్‌ను తెగ మెచ్చుకున్నారు ఆ స్కీము నా సమక్షంలోనే– రుద్రయ్యా, క్రిష్ణమూర్తి చచ్చిన వాళ్ళతో సమానంగా పడివున్నప్పుడు– వేశారు. వాళ్ళు నాకు కొద్ది అంగుళాల దూరంలో మాత్రమే వున్నారు. వాళ్ళ కళ్ళల్లో, గుండెల్లో రగులుతున్న కక్షనేడు చాలా స్పష్టంగా చూశాను. మనిషికంటే క్రూరమైన జంతువు. విషపు జంతువు నాకా క్షణం యేరీ సృష్టి మొత్తంలో మరొకటికనపళ్ళేదు. ద్వేషాలన్నిటితోనూ అతి ఘోరమూ, భయం కరమూ అయిన ద్వేషం– వర్గద్వేషం. ధర్మశాస్త్రి, కేడీ చౌదరీ ధనికవర్గానికి చెందిన వాళ్ళు రుద్రయ్యా క్రిష్ణమూర్తీ కార్మికవర్గానికి చెందినవాళ్ళు. ధనికర్గానికి తమపై తిరగబడిన కార్మికవర్గంపై జాలి ఎంతమాత్రం ఉండదు గాక ఉండదు. వాళ్ళని నాశనం చెయ్యడానికీ, నామ రూపాల్లేకుండా చెయ్యడానికీ ఎంతకయినా తెగిస్తారు.

ధర్మశాస్త్రివగైరాలు జైల్లో పడేసిన ఆ కార్మికులనిద్దర్నీ పెట్టిన హింసలూ వాళ్ళను సర్వనాశనం చేసుందుకు చేసిన పనులూ చూసి నేను గ్రహించినది. ఒక వర్గం మనిషి పెట్టే హింసకంటె ఘోరమయిన హింస ఈ సృష్టి మొత్తంలో మరొకటి లేదు. మానవుడిలోగల ఈ విపరీత ప్రవృత్తికీ, దారుణ ప్రవర్తనకీ నేను నిలువెల్లా వణికిపోయాను. జడిసిపోయాను. ఆశ్చర్యపోయాను. దిమ్మెరపోయాను.

ఆ తరువాత–

కరియప్ప రుద్రయ్యనీ, క్రిష్ణమూర్తినీ రౌడీల సహాయంతో చంపేసి పారెయ్యడానికి రహస్యంగాకారులో తీసుకువెళుతున్న సమయంలో, వాళ్ళు వాళ్ళు ఎలాగో అంతా కనిపెట్టేసి కరియప్ప కారును అడ్డగించారనీ, కరియప్ప తప్పించుకు పారిపోయాడనీ కార్మికులు మహా ప్రభంజనంలాగ, ఆపరాని ఉప్పెనలాగ, పట్టరాని ప్రళయంటాగ ధర్మశాస్త్రి, కేడీ చౌదరి వగైరాల పనిపట్టడానికి వస్తున్నారనీ ఇప్పుడిప్పుడే విన్నాను. ధర్మశాస్త్రి కంగారుగా క్రూరంగా, భయంగా నీచంగా చిందులు తొక్కుతూ తిరగడం ఇప్పుడే చూశాను. బోన్లోంచి వదిలి ఆ రాబోయే అలగాజనం మీదకి నన్ను ఉసిగొల్పుతానని పేలడమూ ఇప్పుడంటే ఇప్పుడే విన్నాను. ఆహా! మానకుడెంత దుర్మార్గుడూ, అనుకోకుండా వుండలేక పోతున్నాను.

*రచన : ఏప్రిల్ / మే 1978*

*ప్రచురణ : ప్రభవ, జులై 1980*

***విశాఖ రచయితల సంఘం కథలపోటీలో బహుమతి పొందిది.***

***విశాఖపట్నం హిందూరీడింగ్ రూంలో / బహుమతి ఇచ్చినవారు రావిశాస్త్రిగారు. 20-8-78***